సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 27 | నవంబర్ | 2024



కరాటే వీరులు..
ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకు కరాటే సాధన చేస్తున్నారు. కటా, కుమతి, కుంగ్‌–ఫూ తదితర అంశాల్లో హోరాహోరీగా పోటీపడుతున్నారు. - 8లో ▸



ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు
రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0°/14.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్‌

పోలీస్‌ డ్యూటీ మీట్‌కు పీసీ అంజయ్య



మహబూబాబాద్‌ రూరల్‌: జాతీయస్థాయి ఆల్‌ ఇండియా పోలీస్‌ డ్యూటీ మీట్‌కు జిల్లా పోలీస్‌ శాఖ నుంచి బాంబ్‌ స్క్వాడ్‌ కానిస్టేబుల్‌ కొంపెల్లి అంజయ్య ఎంపికయ్యాడు. జార్ఖండ్‌ రాజధాని రాంచిలో 2025 జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు ఆల్‌ ఇండియా పోలీస్‌ డ్యూటీ మీట్‌ జరగనుండగా ఇంటెలిజెన్స్‌ ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో రెండు నెలలపాటు అంజయ్య మొయినాబాద్‌ పోలీస్‌ అకాడమీలో సెక్యూరిటీ వింగ్‌ ట్రైనింగ్‌ తీసుకోనున్నాడు. రాష్ట్రం నుంచి బాంబ్‌ స్క్వాడ్‌ తనిఖీల్లో భాగంగా రూం సెర్చ్‌ విభాగానికి ఆయన ఎంపికయ్యాడు. జిల్లా అడిషనల్‌ ఎస్పీ జోగుల చెన్నయ్యను పీసీ అంజయ్య మర్యాదపూర్వకంగా కలువగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అడ్మిన్‌ అనిల్‌ పాల్గొన్నారు.

రాకపోకలు బంద్‌



కేసముద్రం: రైల్వే థర్డ్‌లైన్‌ పనుల్లో భాగంగా కేసముద్రంస్టేషన్‌లోని రైల్వే అండర్‌ డ్రైయినేజీ వద్ద మంగళవారం పనులు చేపట్టారు. కాగా రైల్వేట్రాక్‌కు ఇరువైపులా ద్విచక్రవాహనాదారులు, బాటసారులు రాకపోకలు సాగించేవారు. ఈ మేరకు అండర్‌డ్రైయినేజీ వద్ద రైల్వేథర్డ్‌లైన్‌ పనులు చేస్తుండడంతో రెండువైపులా మొరం పోసి రాకపోకలను బంద్‌ చేశారు. పనులు పూర్తయ్యే వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనాదారులు రైల్వేఓవర్‌బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక బాటసారులు రైల్వేట్రాక్‌ మీదుగా వెళ్తున్నారు.

ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలి

● కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌ సింగ్‌

మహబూబాబాద్‌: ఓటర్లందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగి, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌ సింగ్‌ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధించిన వాదనలను సుప్రీంకోర్టు తిరస్కరించిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించడం తగదని కోర్టు స్పష్టం చేసిందన్నారు. ఈతీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందన్నారు.

వివరాలు సమర్థవంతంగా నమోదు చేయాలి



దంతాలపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో సమర్థవంతంగా నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే వివరాల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సేకరించిన వివరాలు క్షుణంగా ప్రభుత్వానికి తెలిపినప్పుడే, ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో చేరుతాయన్నారు. వివరాల నమోదు ప్రక్రియలో ఏ మాత్రం తప్పులు దొర్లకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్‌ రాజేశ్వర్‌,ఎంపీడీఓ వివేక్‌రామ్‌, ఎంపీఓ అప్సర్‌ పాషా ఉన్నారు.

నమోదు పక్కాగా చేపట్టాలి

తొర్రూరు: కుటుంబ సర్వే ఆన్‌లైన్‌ నమోదు పక్కాగా చేపట్టాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. డివిజన్‌ కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో కొనసాగుతున్న కుటుంబ సర్వే ఆన్‌లైన్‌ నమోదును పరిశీలించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. షాపింగ్‌ కాంప్లెక్స్‌, ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. మున్సిపల్‌ చైర్మన్‌ రామచంద్రయ్య, ఎంపీడీఓ నర్సింగరావు, ఎంపీఓ పూర్ణచందర్‌, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ,వైద్యాధికారి మీరాజ్‌ ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్‌

కురవి/కేసముద్రం: జిల్లాలో నూతనంగా ఏర్పడిన సీరోలు, ఇనుగుర్తి మండలాలకు ఎంపీడీఓ కార్యాలయాల ఏర్పాటుకు పంచాయతీరాజ్‌ శాఖ ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు మార్గం సుగుమమైంది.

చలి మంట కాగుతున్న యువకులు



తెల్లవారుజామున చలిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



ఉన్ని చెద్దర్లు విక్రయానికి తీసుకెళ్తున్న చిరు వ్యాపారులు





లైట్ల వెలుతురులో కురుస్తున్న మంచు..

గజగజ.. జిల్లాలో వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. మంగళవారం ఉదయం 13.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఈమేరకు స్వెటర్లు, ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. - సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, మహబూబాబాద్‌

సకల వసతుల బడి

డోర్నకల్‌ నియోజకవర్గానికి యంగ్‌ ఇండియా స్కూల్‌

- రెండో విడతలో మంజూరు చేసిన ప్రభుత్వం
- అధునాతన సౌకర్యాలతో నిర్మాణం
- స్థల సేకరణలో అధికారుల నిమగ్నం
- పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం



సాక్షి, మహబూబాబాద్‌: విద్యతోనే ఆర్థిక, సామాజిక అంతరాలు తొలుగుతాయి. ఈమేరకు పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలనే సదుద్దేశంతో కాంగ్రెస్‌ ప్రభుత్వం అంతరాలు లేని చదువుల బడిని ఏర్పాటు చేయాలని భావించింది. ఈమేరకు ప్రతీ నియోజకవర్గంలో యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అయితే మొదటి విడత 28 పాఠశాలలు మంజూరు కాగా.. అక్టోబర్‌ 11న శంకుస్థాపన చేశారు. రెండో విడతలో మరో 26 నియోజకవర్గాల్లో పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. ఇందులో జిల్లాలోని డోర్నకల్‌ నియోజకవర్గానికి చోటు దక్కింది.

అధనాతన సదుపాయాలు

ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలను అధునాతన సదుపాయాలతో నిర్మిస్తారు. 25 ఎకరాల స్థలంలో నిర్మించే ఈ పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదువుతారు. వీరికి బోధించేందుకు 120 మంది అధ్యాపకులను నియమిస్తారు. సువిశాలమైన తరగతి గదులు, డిజిటల్‌ బోర్డులు, కంప్యూటర్‌ ల్యాబ్స్‌ మొదలైన సౌకర్యాలు ఉంటాయి. 900 మంది విద్యార్థులు ఒకేసారి కూర్చొని భోజనం చేసే విధంగా డైనింగ్‌ హాల్‌, పది మంది విద్యార్థులకు ఒక గది చొప్పున బెడ్లు, అందులో రెండు బాత్‌ రూమ్స్‌ ఉంటాయి. బాలబాలికలకు వేర్వేరు హాస్టల్స్‌, టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బందికి వసతి గృహాలు నిర్మిస్తారు. ఇండోర్‌, అవుట్‌డోర్‌ క్రీడా మైదానాలు, ఓపెన్‌ జిమ్‌ ఇలా అన్ని రకాల ఆటలు ఆడుకునేందుకు వీలుగా మైదానం ఉంటుంది.

మట్టిలో మాణిక్యాల వెలికితీత..

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే ఈ పాఠశాలల ముఖ్య ఉద్దేశం. ఉన్నత ప్రమాణాలతో బోధన ఉండేలా పాఠశాలల ఏర్పాటు రూపకల్పన చేశారు. ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమత లేక మధ్యలోనే చదువు మానేసిన వారికి ఈ పాఠశాల ఉపయోగకరంగా ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన, వసతులు ఉంటాయి. ఇందులో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచ స్థాయిలో పోటీ తట్టుకునేందుకు నాల్గో తరగతి నుంచి ఇంటర్‌ వరకు బోధన ఉంటుంది. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు పొందే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతారు.

స్థల సేకరణ ప్రారంభం

గిరిజనులు, ఆదివాసీలు అధికంగా ఉన్న మానుకోట జిల్లాలో మెడికల్‌ కళాశాల, ఇంజనీరింగ్‌, నర్సింగ్‌, హార్టికల్చర్‌ కళాశాలలు ఏర్పాటు చేశారు. ఏకలవ్య, ట్రైబల్‌ వెల్ఫేర్‌, సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. ఇప్పుడు డోర్నకల్‌ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ రావడంతో మానుకోట విద్యా కోటగా రూపుదిద్దుకుంటుంది. నూతనంగా మంజూరైన పాఠశాల ఎక్కడ నిర్మించాలనే ఆలోచనలో డోర్నకల్‌ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు ఉన్నారు. అయితే పాఠశాల నిర్మాణానికి అనువైన 25 ఎకరాల ప్రభుత్వ స్థలం కావాల్సి ఉంది. ముందుగా నర్సింహులపేట మండలంలో స్థలం కోసం వెతకగా.. అంత మొత్తంలో స్థలం లేకపోవడంతో కురవి మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. త్వరగా స్థలాన్ని చూసి పాఠశాల నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తారని అధికారులు చెబుతున్నారు.

సకల వసతులు, మెరుగైన బోధన



పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో బోధన జరిపేలా నిర్మించే యంగ్‌ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ డోర్నకల్‌ నియోజకవర్గానికి మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు. స్థల సేకరణ కోసం అధికారులకు చెప్పాను. అనువైన స్థలం చూసిన వెంటనే పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు పిలుస్తాం.

- రాంచంద్రునాయక్‌, ఎమ్మెల్యే, డోర్నకల్‌

పేద విద్యార్థులకు వరం



మెరుగైన మానవ వనరులను తయారు చేయడం కోసం డోర్నకల్‌ నియోజకవర్గంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్‌ స్కూల్‌ ఈ ప్రాంతం పేద విద్యార్థులకు వరంగా ఉంటుంది. ప్రతిభావంతులైన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటి ఉన్నతంగా ఎదిగే అవకాశం ఉంటుంది. పాఠశాల మంజూరుకి కృషి చేసిన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు కృతజ్ఞతలు.

- జినుకల రమేశ్‌, నర్సింహులపేట

ఈ ప్రాంత విద్యార్థులు అదృష్టవంతులు



ప్రతిభకు పేదరికం అడ్డు రాకూడదు. అందుకోసమే నిర్మించే ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ రెండో విడతలో డోర్నకల్‌కు మంజూరు కావడం సంతోషంగా ఉంది. అన్ని వసతులతో నిర్మించే పాఠశాలలో చదివే అవకాశం వచ్చిన ఈ ప్రాంతం విద్యార్థులు అదృష్టవంతులు. సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది.

- గొల్లపల్లి రజనీకాంత్‌, బలపాల

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

కవర్‌షెడ్‌, ఇతర షెడ్లలో నిండిపోయిన వడ్ల రాశులు

- సరిపడా స్థలం లేక రైతుల ఇబ్బందులు
- రాత్రి పొద్దుపోయే వరకు సగం ధాన్యమే కొనుగోలు



మార్కెట్‌లో కునుకు తీస్తున్న రైతులు

మహబూబాబాద్‌ రూరల్‌: మహబూబాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం ధాన్యం పోట్టెంది. అధిక మొత్తంలో ధాన్యం రావడంతో సరిపడా షెడ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మార్కెట్‌ ఆవరణలోని కవర్‌షెడ్‌, ఇతర షెడ్లన్నీ ధాన్యం రాశులతో నిండిపోయాయి. దీంతో కొంత మంది రైతులు ఆరుబయట సీసీపై ధాన్యం పోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మార్కెట్‌లో పత్తి, మిర్చి విక్రయాలు కూడా జరగడంతో మార్కెట్‌ ఆవరణ పంట ఉత్పత్తులతో కిక్కిరిసిపోయింది.

మిగిలిన ధాన్యం..

మార్కెట్‌లో మంగళవారం 3,862 క్వింటాళ్ల (5941 బస్తాలు) ధాన్యం విక్రయాలు జరుగగా.. అంతే మొత్తంలో ధాన్యం మార్కెట్‌లోనే మిగిలిపోయింది. కాగా తాము మార్కెట్‌ ఓపెన్‌ ప్రాంగణంలో ధాన్యం పోసుకున్నామని, చలితీవ్రత, మంచు కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ధాన్యం విక్రయాలు జరగని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మార్కెట్‌కు వచ్చే రైతుల కష్టాలు, అవసరాలను గుర్తించి క్రయ విక్రయాలకు సరిపడే విధంగా స్థలం కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

ఆరుబయట పోసుకున్నాం..



పుట్టెడు వడ్లు అమ్మేందుకు తీసుకురాగా మార్కెట్‌ ఆవరణలోని షెడ్లన్నీ ధాన్యం, పత్తి, మిర్చి బస్తాలతో నిండి ఉన్నాయి. దీంతో గత్యంతరం లేక మార్కెట్‌లోని సీసీ ప్రాంగణంపై ధాన్యాన్ని పోసి ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాత్రి పొద్దుపోయే వరకు కూడా కొనుగోళ్లు జరగకపోవడంతో పడిగాపులు పడుతున్నాం.

- వాంకుడోత్‌ వీరేందర్‌, రైతు, చెరువుకొమ్ముతండా

రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదు



కష్టపడి పంట పండించి తీరా మార్కెట్‌కు అమ్ముకునేందుకు వస్తే రైతుల కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. సరైన వసతి సౌకర్యం లేక మార్కెట్‌లోనే ఉండాల్సి వస్తుంది. షెడ్లన్నీ నిండినప్పటికీ కొనుగోళ్లు జరిగిన తర్వాత బస్తాలు సకాలంలో వ్యాపారులు తీసుకెళ్లకపోవడంతో మేము మా సరుకులను ఆరు బయటే పోయాల్సి వస్తుంది.

- భూక్య వెంకన్న, రైతు, బుద్యాతండా

ధాన్యం వివరాలు వెంటనే నమోదు చేయాలి

● వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌, అదనపు కలెక్టర్లు, అధికారులు

మహబూబాబాద్‌: కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతులు ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యానికి బోనస్‌ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్‌ అద్వైత్‌కుమార్‌ సింగ్‌, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌ టొప్పో, వీరబ్రహ్మచారి, డీసీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్‌, సివిల్‌ సప్లయీస్‌ డీఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

● డీఈఓ రవీందర్‌రెడ్డి



వెన్నారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

డోర్నకల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని వెన్నారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తనిఖీ నిర్వహించి.. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం విద్యార్థుల అభ్యసనాస్థాయిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థు ల అభ్యసనాశక్తి పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు. ఏఎంసీ చంద్రశేఖర్‌, ఎంఈఓలు ఆంగోత్‌ లక్ష్మా, మహంకాళి బుచ్చయ్య,హెచ్‌ఎంలు రుక్మాంగదరరావు, సుధాకర్‌,సురేష్‌ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

గూడూరు: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం డీఈఓ తనిఖీ చేశారు. ముందుగా వంటకాలను పరిశీలించి, నాణ్యతగా వండి వడ్డించాలని సూచించారు. తరగతి గదులు తిరుగుతూ విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు 10జీపీఏ సాధించాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో ఇష్టంగా చదవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే ప్రిన్సిపాల్‌కు తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ సునీత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తాం

● డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు

తొర్రూరు: రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలు మంజూరు చేస్తామని డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. మంగళవారం డివిజన్‌ కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకును చైర్మన్‌ రవీందర్‌రావు సందర్శించారు. కొత్త పంట రుణాల చెల్లింపు, బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా చూడాలన్నారు. సంఘాల ద్వారా అందించిన రుణాలను లీగల్‌గా కవర్‌ చేయాలని, రుణాల రికవరీ చేపట్టి సంఘాలను పటిష్టపరచాలన్నారు. రైతులకు డీసీసీబీ అండగా ఉంటుందన్నారు.

చాలీచాలని వేతనాలు

రెండో ఏఎన్‌ఎంల ఇబ్బందులు

- రెగ్యులరైజ్‌ చేయాలని వేడుకోలు
- నిరాశలో ఆశవర్కర్లు



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు(ఫైల్‌)

నెహ్రూసెంటర్‌: ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు. తమను ఎలాంటి అర్హత పరీక్షలు నిర్వహించకుండా తీసుకోవాలని కోరుతున్నారు. 2008రిక్రూట్‌మెంట్‌ ద్వారా విధుల్లో చేరిన తాము అరకొర వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో 150 మంది ఏఎన్‌ఎంలు, 840 మందికి పైగా ఆశ వర్కర్లు ఉన్నారు.

రెగ్యులరైజ్‌ చేయాలని..

జిల్లాలో సుమారు 159 మంది రెండో ఏఎన్‌ఎంలు 2008వ సంవత్సరంలో కాంట్రాక్ట్‌ పద్ధతిలో నియామకమయ్యారు. ఏళ్ల తరబడి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ రెగ్యులర్‌ వారితో పాటు అలవెన్స్‌లు, టీఏ, డీఏలు రావడం లేదు. ఉద్యోగ భద్రత, విధి నిర్వహణలో మృతి చెందితే కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా అమలు చేసే పరిస్థితి లేదు. కాగా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

పెరిగిన పనిభారంతో సతమతం..

ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలు అందించేందుకు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు కీలకంగా వ్యవహరిస్తుంటారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై అప్రమత్తం చేస్తూ ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. టీకాల పంపిణీ, ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్య సేవలు అందించేలా కృషి చేస్తున్నారు.

నిరాశలో ఆశవర్కర్లు..

చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్న తమకు ఫిక్స్‌డ్‌ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ వర్కర్లు డిమాండ్‌ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేపడుతున్న వైద్య కార్యక్రమాల నిర్వహణ, సంక్షేమ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాల అమలులో వారు కీలకంగా పని చేస్తున్నారు. గర్భిణుల నమోదు, డెలివరీ, పోలియో చుక్కలు వేయడం వంటి కార్యక్రమాలో ముందుంటున్నామని, సరైన వేతనాలు లేక జీవితంలో పూర్తి నిరాశే మిగిలిందని ఆశకార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి...

రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ డీఎంహెచ్‌ఓకు రెండో ఏఎన్‌ఎంలు, సంఘాల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనేక ఏళ్లగా కాంట్రాక్ట్‌ పద్ధతిలో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. సర్వీస్‌ వెయిటేజీకి 50 మార్కులు, వయోపరిమితి ఎత్తివేయాలని, సమాన పనికి సమాన వేతనం, ఎక్స్‌గ్రేషియా, ఆరోగ్యబీమా, పోస్టుల సంఖ్య పెంపు వంటి డిమాండ్లను రెండో ఏఎన్‌ఎంలు తీసుకువస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లను రెగ్యులరైజ్‌ చేయాలి. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి. కాంట్రాక్ట్‌ ఉద్యోగులను పర్మనెంట్‌ చేయాలి. హామీలను అమలు చేయాలి.

- కుంట ఉపేందర్‌, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సేవలను గుర్తించాలి



ప్రజలకు చేస్తున్న ఆరోగ్య సేవలను ప్రభుత్వం గుర్తించి తమను పర్మనెంట్‌ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అందించి ఆదుకోవాలి. ఉద్యోగ భద్రత, ఎక్స్‌గ్రేషియా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలి.

- నసీమాబేగం, రెండో ఏఎన్‌ఎం

అనుమతి లేకుండా పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

● డీఎంహెచ్‌ఓ మురళీధర్‌



తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

తొర్రూరు: అనుమతి లేకుండా రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ గుండాల మురళీధర్‌ అన్నారు. మంగళవారం డివిజన్‌ కేంద్రంలోని పలు డయాగ్నోస్టిక్‌ కేంద్రాలను వైద్యాధికారులు తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డయాగ్నోస్టిక్‌ సెంటర్లలో విధిగా రోగ నిర్ధారణ పరీక్షల ధరల వివరాలను ప్రదర్శించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అర్హత లేని వైద్యులు చికిత్సలు చేస్తే చర్యలు ఉంటాయన్నారు.

16 మంది ప్యాసింజర్ గార్డుల తరలింపు

- ఆందోళనలో కాజీపేట రైల్వే గార్డులు
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

కాజీపేట రూరల్: కాజీపేట నుంచి 16 మంది రైల్వే ప్యాసింజర్ గార్డులను అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు రైల్వే గార్డులు, రైల్వే నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ తర్వాత అతిప్రధాన కాజీపేట జంక్షన్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల రైల్వే లింక్‌లను ఇతర రైల్వే డిపోలకు తరలించారన్నారు. ప్రస్తుతం కొత్తగా కాజీపేట కేంద్రంగా పని చేస్తున్న 16 మందిని వేరే రైల్వే డిపోలకు తరలించి ఈ డిపోకు ప్రాధాన్యం తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కాజీపేట డిపోలో 2024లో 17 రైల్వే గార్డుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు గుర్తించారన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ట్రెనింగ్ పూర్తయిన 18 మంది కాజీపేట రైల్వే గారుల్లో16 మందిని సోమవారం వేరే డిపోలకు తరలించారని తెలిపారు. కాజీపేట నుంచి ఇతర రైల్వే డిపోలకు గార్డుల తరలింపు వల్ల రైల్వేశాఖకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని, అదే 16 మంది రైల్వే గార్డులకు ఇక్కడే పోస్టింగ్ ఇస్తే రూ.16 లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆలోచించి తరలించిన గార్డులను తిరిగి కాజీపేటకు తీసుకొచ్చి రైల్వేకు ఆదాయం మిగిలేలా చూడాలని నాయకులు పేర్కొంటున్నారు.

రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్..

కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణమవుతుండగా మరో వైపు కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదిలా ఉండగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న క్రమంలో కొంత మంది రైల్వే అధికారులు కావాలని గతంలో క్రూ లింక్‌ల తరలింపు చేయగా, ఇప్పుడు గార్డుల తరలింపు చేసి కాజీపేట లో కోహైలెట్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేసే కుట్రచేస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు పట్టించుకుని రైల్వే జీఎంతో మాట్లాడాలని రైల్వే గార్డులు, నాయకులు కోరుతున్నారు.

ధిక్కరణ కేసులో తహసీల్దార్‌ను మందలించిన కోర్టు

వరంగల్ లీగల్ : కోర్టు ఆదేశాలను ఎనిమిది నెలలుగా అమలు చేయకుండా ధిక్కరించిన హసన్‌పర్తి తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉపేందర్‌రావు మంగళవారం తీవ్రంగా మందలించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ సుజాత వంశపారపర్యంగా ఉమ్మడి కుటుంబ ఆస్తిలో తన భాగం ఇవ్వాలని కోర్టులో దావా వేసింది. దీనిపై విచారణ చేసిన కోర్టు 2024 ఏప్రిల్‌లో అప్పటి జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. పిటిషన్‌దారు ఏరుకొండ సుజాతకు తన ఇరువురి సోదరులతో పాటు మూడో భాగం వాటాను పంపకం చేసి రిజిస్ట్రేషన్, పట్టా పాస్ బుక్‌లు జారీ చేయాలని హసన్‌పర్తి తహసీల్దార్‌ను ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఎనిమిది నెలలుగా ఈ తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేసిన తహసీల్దార్‌ను గతంలో తన ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. అయినా హాజరుకాకపోవడంతో మంగళవారం తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను జడ్జి ఉపేందర్‌రావు మూడు రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. విషయం తెలిసిన జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది తహసీల్దార్‌తో సహా హాజరై లిఖిత పూర్వకంగా క్షమాపణ కోరిన అనంతరం తీర్పులో భాగంగా పిటిషన్‌దారు ఏరుకొండ సుజాత వాటాను రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టా పాస్ బుక్‌లు జారీ చేశారు. ఉదయం నుంచి కోర్టు ప్రాంగణంలో ఈ విషయంపై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ దినోత్సవం రోజున మహిళలకు తమ వాటా తమకు దక్కేలా తీర్పు అమలు కావడంతో పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటే వీరులు..

ఎవరు కొడితే.. మైండ్ బ్లాక్ అయిపోతుందో.. వారే కరాటే వీరులు.. మార్షల్ ఆర్ట్స్‌కు హనుమకొండ జిల్లా కేరాఫ్‌గా మారుతోంది. ముఖ్యంగా బాలబాలికలు, మహిళల్లో కరాటే ఆత్మ విశ్వాసం నింపుతోంది. తమపై దాడి చేయాలని చూసే వారి భరతం పట్టేలా తయారవుతున్నారు. అంతేకాదు ఈ పోటీల్లో పతకాలు సాధిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ జిల్లా పేరును నిలబెడుతూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.





కాజీపేటలో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలు
- జిల్లాలో సాధన చేస్తున్న చిన్నారులు
- జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం
- శిక్షకులుగా రాణిస్తున్న యువత

కాజీపేట: జిల్లాలో ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకూ కరాటే సాధన చేస్తున్నారు. ఒకనాడు పదుల సంఖ్యలో ఉన్న సాధకులు నేడు వందల సంఖ్యలోకి చేరారు. ఫలితంగా జాతీయస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. కాజీపేట పట్టణంలో రెండుసార్లు జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన అనేక మంది సాధకులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఓడించి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. నగరంలోని అనేక క్రీడా మైదానాలతోపాటు కాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. కటా, కుమతి, కుంగ్‌-ఫూ తదితర అంశాల్లో బాలబాలికలు హోరాహోరీగా పోటీపడుతున్నారు. పదుల సంఖ్యలో కరాటే శిక్షకులు శిక్షణ అందిస్తున్నారు. కుంగ్‌ఫూ, జపాన్ షాటోఖాన్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్లు పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో ఆసక్తి పెంచుతున్నాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు మూడు నెలల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికలకు వారంలో మూడు రోజులు శిక్షణ ఇస్తుండడం విశేషం. వారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. ఆత్మ రక్షణకు అవసరమైన రీతిలో శిక్షణ పొందుతున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



కరాటే అంటే మాకు చాలా ఇష్టం. కుంగ్‌ఫూ మాస్టర్ పర్యవేక్షణలోనే తగిన శిక్షణ తీసుకుంటున్నాం. సెలవు రోజుల్లో ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేస్తున్నాం. మాలో ఎక్కడా లేని ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొంటామనే ధైర్యం ఏర్పడింది. గ్రీన్, ఎల్లో బెల్ట్‌లు సాధించాం.

– కొలిపాక సాత్విక, కల్యాణి, మడికొండ

అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమే..



అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమేనని గుర్తించాలి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా సునాయాసంగా ఎదుర్కొనే మొండి ధైర్యం దీని శిక్షణతో కలుగుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆటపాటలతో పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాలి. దాని వల్ల మానసికంగా, శారీరక సమస్యలు తట్టుకోవడానికి అలవాటు పడతారు.

– డి.కంఠేశ్, గ్రాండ్ మాస్టర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : మహోన్నత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సంవిదాన్ దివస్ రాజ్యాంగ దినోత్సవ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి రాజ్యాంగం వినియోగంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రధానవక్త కేయూ లా కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ టి. విజయచంద్ర 'భారత రాజ్యాంగం డెమొక్రటిక్ గవర్నెన్స్' అనే అంశంపై మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం తోనే రాజకీయ ప్రజాస్వామ్యం సాధ్యమన్నారు.మన స్వేచ్ఛను సరెండర్ చేయొద్దన్నారు. సభలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి. రమ, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి. రాంచంద్రం, కేయూఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీ మొదటిగేట్ నుంచి విద్యార్థుల పాదయాత్రను వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. దూరవిద్యకేంద్రం ప్రాంగణంలోఅంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రిజిస్ట్రార్ మల్లారెడ్డి బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయించారు.

భారత రాజ్యాంగం గొప్పది

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: భారత రాజ్యాంగం గొప్పదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సీఎండీ వరుణ్‌రెడ్డి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరులకు హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.వి.ఓ బి.జనార్దన్, సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, కె.ఎన్.గుట్ట, బీకం సింగ్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షల కోసం వెళ్తే ఇల్లు గుల్ల..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు
- 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై భీమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య కారణాలతో వైద్య పరీక్షల నిమిత్తం ఓ కుటుంబం హైదరాబాద్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో నివాసం ఉండే మాజీ వార్డు సభ్యురాలు జెన్నాయికోడె శోభ, వేణుగోపాల్ దంపతులు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం ఇంటికి తాళంవేసి హైదరాబాద్ వెళ్లారు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం తమ ఇంట్లో పనిచేసే మహిళ వచ్చి చూడగా తలుపులు తీసి కనిపించాయి. దీంతో ఆమె ఆందోళన చెంది పక్కింటివారికి చెప్పగా వారు వెంటనే శోభ, వేణుగోపాల్ దంపతులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించగా ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న సెంట్రల్ లాక్ తొలగించి ఉంది. ఇంట్లోని రెండు బీరువాల్లో భద్రపరిచిన 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై భీమారెడ్డి, క్లూస్ టీం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం గణపురం మండలకేంద్రంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజక వర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగం ఏర్పడి నేటికి 75 సంవత్సరాలు కావడం.. ఈ రోజే ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ సర్కారు పని చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తమ సర్కారు సంవత్సరకాలంలోనే 53 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో రైతులకు రుణ మాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం ఒకేసారి రూ. 18వేల కోట్ల రుణ మాఫీని ఏక కాలంలో చేసిందన్నారు. కాగా, గణపురం నుంచి గుర్రంపేట వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కృషితో రూ. 15 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుతో పాటు మోరంచ వాగు పై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తాము ప్రజా సేవకులమని, ప్రజల కష్టాలు, సమస్యలు తీర్చడం కోసం 18 గంటల పాటు పని చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు తమ స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు 170 ఎకరాలు అప్పగించగా తాను భూమిని వెనక్కి తీసుకుని ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు గాంధీనగర్ గుట్ట మీద 60 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్‌ను, 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుమారుడికి సద్ది ఇవ్వడానికి వెళ్లి..

- బావిలో పడి గొర్రెల కాపరి మృతి



మల్లయ్య(ఫైల్)

దుగ్గొండి: గొర్రెల మంద వద్ద ఉన్న తన కుమారుడికి భోజనం అందించడానికి వెళ్లిన ఓ గొర్రెల కాపరి బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోట మల్లయ్య(60) సోమవారం రాత్రి మంద వద్ద ఉన్న తనకుమారుడికి భోజనం టిఫిన్ పట్టుకుని వెళ్తున్నాడు. అయితే మందకు కొంత దూరంలో వ్యవసాయ బావి వద్ద కాలుజారి అందులో పడ్డాడు. దూరం నుంచి గమనించిన కుమారుడు తోటి గొర్రె కాపరులతో కలిసి బావిలోకి దిగి మల్లయ్యను బయటకు తీశారు. అనంతరం దుగ్గొండి ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన మల్లయ్య మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారులు నవీన్, రాజుకుమార్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

దొంగల ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

- సాంకేతికతను వినియోగిస్తున్న పోలీసులు



బాధితుడితో మాట్లాడుతున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఈ నెల 23వ తేదీన దావ కిశోర్ అనే వ్యక్తి ఇంట్లో జరిగిన చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. భార్య ఆస్పత్రికి.. తాను పిల్లల కోసం ట్యూషన్ వద్దకు వెళ్లి వచ్చే సరికి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు దాదాపు 35 తులాల బంగారం చోరీకి గురైనట్లు చెబుతుండగా బాధితుడు మాత్రం ఎక్కువే జరిగిందని తెలుపుతున్నాడు. దొంగలు ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనం వినియోగించినట్లు సీసీ కెమెరాల్లో కనిపించడంతో దొంగలు స్థానికుల లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా అనే అంశం అర్థం కావడం లేదు. కిశోర్‌కు తెలిసిన వాళ్లు ఎవరైనా చోరీకి పాల్పడి.. కేసును పక్కదారి పట్టించడం కోసం ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని వినియోగించి ఉంటారా అనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో సరిపోల్చుతున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు కేసు ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితోపాటు లోకల్ సీఐ, ఎస్సైలు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి దొంగలను పట్టుకోవడానికి అడుగులు వేస్తున్నారు.

కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు ఆ విభాగం అధిపతి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 'గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ప్రాసెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే అంశంపై ఈ జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వలేదంటూ..

- మాజీ ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మాజీ జెడ్పీటీసీ సారయ్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భాస్కర్ దంపతులు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య డబ్బులు ఇవ్వడం లేదంటూ సుందరయ్యనగర్‌కు చెందిన గంధ్రతి భాస్కర్ దంపతులు మంగళవారం ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిల్‌తో సారయ్య ఇంటి ఎదుట బైఠాయించారు. ఏనుమాములలో సుమారు 600 గజాల భూమిని సారయ్య, భాస్కర్, రాజు కొనుగోలు చేశారు. ఈ భూమిలో మరో వ్యక్తి గృహ నిర్మాణం చేస్తుండగా అడ్డుకోవడంతో మూడేళ్ల క్రితం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ భూమికి చెల్లించిన డబ్బులు ఇస్తే కేసు విరమించుకుంటామని భాస్కర్, రాజు పోలీసులకు చెప్పడంతో సారయ్య ఇరువురికి డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అయితే డబ్బులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడిచినా చెల్లించకపోవడంతో విసిగివేసారిన భాస్కర్ దంపతులు ఆందోళనకు దిగినట్లు స్థానికులు తెలిపారు. పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనను విరమింపజేసి భాస్కర్ దంపతులను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పెద్ద మనుషులు ఇరువర్గాలతో చర్చించారు. వచ్చే నెల 10వ తేదీన సారయ్య డబ్బులు ఇవ్వాలని, ఆ డబ్బులు అతడు ఇవ్వకుంటే తాను ఇస్తానని డివిజన్‌కు చెందిన అధికార పార్టీ నాయకుడు హామీ ఇవ్వడంతో కథ సుఖాంతం అయ్యింది. ఈ విషయంపై కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ సారయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. తాను భాస్కర్‌కు ఎలాంటి డబ్బులు బాకీ లేనన్నారు. స్థలం కొనాలని భాస్కర్ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తే 10వ తేదీలోగా డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

రైతు సదస్సులో వరంగల్ మార్కెట్ స్టాల్



చపాట రకం మిర్చి



కలాసీ రకం..



వండర్‌హాట్ రకం..

వరంగల్: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రైతు సదస్సులో ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల మంగళవారం తెలిపారు. 28వ తేదీన సదస్సును మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తున్నారని, 30వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌లో చపాటా, కలాసీ (ఎల్లోకలర్ మిర్చి), వండర్‌హాట్ రకాల మిర్చి షాంపిల్స్‌ను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- వెంకటాపురంలో ఘటన



శోభన్‌బాబు(ఫైల్)

దుగ్గొండి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హింగే శోభన్‌బాబు(48)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఎన్నిసార్లు సాగు చేసిన నష్టమే తప్పా లాభం రాలేదు. ఈ క్రమంలో వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు ఇలా మొత్తం రూ. 10లక్షల వరకు అప్పు అయ్యింది. అయితే అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మిరపతోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్ద కూతురు రవళికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో భార్య హింగే ఉమ కొంతమంది రైతులతో కలిసి బావివద్దకు వెళ్లగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే నర్సంపేటకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.